క్లుప్తంగా

మినరల్‌వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న నాయకులు

దహెగాం: విద్యార్థుల సౌకర్యార్థం శుద్ధజలం ప్లాంట్‌ను ఎంపీపీ కంబగౌని సులోచన ఆదేశాల మేరకు మంగళవారం ప్రారంభించినట్లు బీఆర్‌ఎస్ నాయకుడు సంతోష్‌గౌడ్ అన్నారు. మండలంలోని చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పరిషత్ నిధుల నుంచి రూ.3 లక్షలతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు

తిర్యాణి: అనుమతులు లేకుండా ప్రభుత్వ భూముల్లో కట్టడాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సునీల్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల కేంద్రంలో రోడ్డు పక్కన అనుమతులు లేకుండా కొంతమంది వ్యక్తులు టేలాలు, షెడ్లు ఏర్పాటు చేసున్నారన్నారు. వారికి నోటీసులు అందజేసి మూడు రోజుల్లో అక్రమ కట్టడాలను తొలగిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా ఎట్టి పరిస్థితుల్లో నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు.

108లో ప్రసవం



శిశువును అప్పగిస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని సడక్‌గూడ గ్రామానికి చెందిన సీడం మెంగుబాయి అనే గర్భిణీ 108 వాహనంలో మగ శిశువుకు జన్మనిచ్చినట్లు ఈఎమ్‌టీ రజినీకాంత్, పైలెట్ భీంరావు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో సడక్‌గూడ గ్రామం నుంచి 108 వాహనంలో పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణీని వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో పురిటి నొప్పులు ఎక్కువ కాగా వాహనాన్ని నిలిపి ప్రసవం జరిపినట్లు తెలిపారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని వాంకిడి ఆసుపత్రిలో చేర్పించినట్లు పేర్కొన్నారు.

ఈ కేవైసీ వివరాలు నమోదు



వివరాలు సేకరిస్తున్న ఏఈవో విజయ్

చింతలమానెపల్లి: మండల పరిధిలోని రైతుల నుంచి మంగళవారం ఏఈవో విజయ్ కుమార్ ఈకేవైసీ వివరాలను సేకరించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద లబ్ధిదారుల వివరాలను నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆధార్ కార్డు ఆధారంగా ఫేస్ రికగ్నేషన్ నిర్వహించినట్లు పథకంలో అక్రమాలకు పాల్పడకుండా ఈ విధానం చేపడతారని ఆయన తెలిపారు. సంబంధిత రైతులు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధికి అర్హులుగా ఉంటే సంప్రదించాలని ఆయన కోరారు.

పోడు భూముల్లో ఉపాధి పనులు చేపట్టాలి

తాంసి: ప్రభుత్వం పట్టాలు అందించిన పోడు భూముల్లో ఉపాధి పనులు చేపట్టేలా చూడాలని కొలాం, గిరిజనులు కోరారు. భీంపూర్ మండలంలోని అర్లి(టి), శాంతినగర్, మందపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులు మంగళవారం భీంపూర్‌లో డీఆర్‌డీఏ ఏపీడీ కుటుంబరావుకు, ఎంపీడీవోకు ఆయన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆర్‌ఓఎఫ్‌ఆర్ కింద పట్టాలు అందజేసిన భూముల్లో చేపట్టే ఉపాధి పనులను అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

తాంసి: విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉందని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి డీఎస్పీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి పరీక్ష రాయాలన్నారు.

ఖాళీగా ‘అంగన్‌వాడీ’ పోస్టులు

- టీచర్లు లేక అక్షరాలకు దూరంగా పిల్లలు
- ఏళ్లుగా నియామకాలపై నిర్లక్ష్యం
- భర్తీ చేయాలని వేడుకోలు



ఇది కౌటాల మండలం గురుడుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని యాపలగూడ అంగన్‌వాడీ కేంద్రం. ఈ కేంద్రంలో 32 మంది పిల్లలు, నలుగురు బాలింతలు, ఎనిమిది మంది గర్భిణులు ఉన్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన టీచర్ మూడేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి గురుడుపేటలోని టీచర్‌కు ఇక్కడి బాధ్యతలు అదనంగా అప్పగించారు. రెగ్యులర్ టీచర్ లేకపోవడంతో ఇక్కడి పిల్లలకు అక్షరాలు నేర్పేవారు లేకుండా పోయారు. ఆయానే అన్ని పనులు చేస్తుంది. ఆయా సెలవులో ఉంటే కేంద్రం తెరుచుకునే పరిస్థితి లేదు. ఈ కేంద్రానికి రెగ్యులర్ టీచర్‌ను కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.



కోయగూడలోని అంగన్‌వాడీ కేంద్రం

కౌటాల: తల్లీబిడ్డల సంక్షేమం కోసం చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన భవనాలు లేక, ఖాళీగా ఉన్న టీచర్లు, సిబ్బంది నియామకం చేపట్టకపోవడంతో సరైన సిబ్బంది లేకుండానే అరకొర వసతుల మధ్య అంగన్‌వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. సిబ్బంది లేని కారణంగా పలు చోట్ల కేంద్రాలు సక్రమంగా తెరుచుకోవడం లేదు.

ఖాళీగా పోస్టులు

జిల్లా వ్యాప్తంగా 834 అంగన్‌వాడీ కేంద్రాలు, 139 మినీ కేంద్రాలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చింది. దీంతో జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య 973కు చేరింది. వీటి పరిధిలో 4,900 మంది గర్భిణీలు, 4,410 మంది బాలింతలు, 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 45,260 మంది ఉన్నారు. ప్రతీ కేంద్రంలో ఒక టీచర్, ఆయా ఉండాలి. ప్రస్తుతం 786 మంది పని చేస్తుండగా మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో 101 మంది పని చేస్తున్నారు. దీంతో 86 అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 716 మంది ఆయాలు విధులు నిర్వర్తిస్తుండగా 257 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. టీచర్లు లేనిచోట ఆయాలు, ఆయాలు లేనిచోట టీచర్లను తప్పనిసరి పరిస్థితుల్లో కొనసాగిస్తున్నారు. దీంతో కేంద్రాల నిర్వహణ సరిగా లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కేంద్రాలకు ప్రభుత్వం పంపిణీ చేసిన సరుకులు పక్కదారి పడుతున్నాయనే విమర్శలున్నాయి.

చదువుకు దూరం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు, ఆయాలు లేకపోవడంతో సిబ్బంది లేని కేంద్రాల్లోని చిన్నారులు ఆటపాటలు, అక్షరాలకు దూరమవుతున్నారు. అలాగే చిన్నారుల ఆరోగ్య స్థితిని, నెలవారీగా పిల్లల ఎత్తు, బరువు కొలిచే ప్రక్రియ సైతం నామమాత్రంగా జరుగుతుంది. దీంతో పౌష్టికాహారం లోపాలున్న పిల్లలకు అదనపు పోషకాలు అందించే వీలు లేకుండా పోతుంది. టీచర్ లేని చోట ఫోన్‌లోని యాప్‌ను వినియోగించడంపై ఆయాలకు పూర్తిస్థాయిలో అవగాహన లేదు. ఖాళీలు ఉన్న కేంద్రాలను సమీప కేంద్రాల నిర్వాహకులకు ఇన్‌చార్జి ఇచ్చినప్పటికీ ఆశించిన మేర పని చేయకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. అదనపు బాధ్యతలు నిర్వహించే సిబ్బంది సరైన సేవలు అందించలేక పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని పలువురు కోరుతున్నారు.

వెంటనే భర్తీ చేయాలి



అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేని చోట పిల్లలు ఆటలు, అక్షరాలకు దూరమవుతున్నారు. ఏళ్లుగా అంగన్‌వాడీ, ఆయాల పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. దీంతో పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మా గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్ పోస్టు గత మూడేళ్లుగా ఖాళీగా ఉంటుంది. టీచర్లు లేని చోట ఇన్‌చార్జీలను నియమించారు. వారిపై పని భారం పెంచకుండా కొత్త ప్రభుత్వం ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.

- శ్రీలత, యాపలగూడ

అధికారులకు నివేదించాం..

అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేని చోట ఇన్‌చార్జీలను నియమించాం. కేంద్రాల ద్వారా పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం అందిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న టీచర్లు, ఆయాల పోస్టుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్ల, ఆయా పోస్టుల భర్తీపై ప్రకటన చేస్తే అధికారులు పోస్టులను భర్తీ చేస్తారు.

- విజయలక్ష్మి, సీడీపీవో, సిర్పూర్(టి)

‘ప్రజాపాలన’లో దరఖాస్తు చేసుకోవాలి

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కౌటాల పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తెలిపారు. మండలంలోని ప్రజలు ప్రజాపాలన దరఖాస్తుల సమాచారం విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజాపాలన సేవ కేంద్రంలో సంప్రదించాలన్నారు. ఆరు గ్యారెంటీల పథకాల కోసం దరఖాస్తులు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నాగంపేట ఎంపీటీసీ చునర్కార్ జమున -మహేశ్ తన అనుచరులతో మంగళవారం సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న విధానాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. ఈమేరకు వారికి పార్టీ కండువా కప్పి శ్రీనివాస్ ఆహ్వానించారు. అదేవిధంగా పట్టణంలోని 20వ వార్డుకు చెందిన యూత్‌నాయకులు పెరక ప్రశాంత్, రాములు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

బెల్లంపల్లి: బెల్లంపల్లి సింగరేణి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బజారు ఏరియాలోని శాంభవి విజన్ సెంటర్ ఆవరణలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.48మందికి కంటి పరీక్షలు చేయగా 10మందికి శుక్లాల సమస్య ఉన్నట్లు గుర్తించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వ్యక్తులను స్థానిక లయన్స్‌క్లబ్ కంటి ఆసుపత్రిలో, హన్మకొండ కంటి ఆసుపత్రులకు రెఫర్ చేశారు.

‘పది’ విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారి సుభాశ్



విద్యార్థులకు సూచనలిస్తున్న ఉద్ధవ్

వాంకిడి: మండలంలోని కేజీబీవీలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ మోటివేషనల్ ప్రసంగ కర్త సుందిళ్ల రమేశ్ విద్యార్థులకు పలు అంశాలను వివరించారు. పై చదువులకు వెళ్లే సమయాల్లో తీసుకోవాల్సిన నిర్ణయాలు ఎలా ఉండాలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి రాథోడ్ సుభాశ్, పాఠశాల ఎస్‌వో పద్మ, ఉపాధ్యాయులు రైసా, విజయలక్ష్మి, శృతి, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

జైనూర్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు సూచనలు ఇవ్వాలని ఏసీఎంవో పుర్క ఉద్దవ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాసిమెట్ట, జైనూర్ ఆశ్రమ పాఠశాలలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులకు సూచనలు అందించారు. సుధాకర్, అధికారులు ఉన్నారు.

‘కాంగ్రెస్‌తోనే పేదల అభివృద్ధి’



మాట్లాడుతున్న సుగుణక్క

కెరమెరి: కాంగ్రెస్ పార్టీతోనే పేదల అభివృద్ధి జరుగుతుందని ఆదిలాబాద్ పార్లమెంట్ నాయకురాలు సుగుణక్క అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. అందరికి ఆసరాగా ఉండే పార్టీ కాంగ్రెస్ అన్నారు. కార్యక్రమంలో జగన్నాథ్‌రావు, సుదర్శన్, దేవేందర్, రమేశ్, పంద్రం శేకు, దుందేరావు, గోపాల్, రమేశ్ తదితరులు ఉన్నారు.

జైనూర్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎల్లవేళలా కృషి చేస్తానని కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణక్క అన్నారు. మంగళవారం జైనూర్ మండల కేంద్రంలో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు ఆశీర్వదించి పార్లమెంట్ పంపిస్తే ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. బ్లాక్ అధ్యక్షుడు ఆయ్యుబ్‌ఖాన్, ఎస్టీ జిల్లా అధ్యక్షుడు కుడ్మేత విశ్వనాథ్, మండాడి లింగు, అజ్జులాలా, ఇస్లాం ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

కౌటాల: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అన్ని వర్గాల ప్రజలు, ఉద్యోగులకు సమన్యాయం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ కన్నెపల్లి గ్రామ అధ్యక్షుడు శ్రీరాముల శంకర్ అన్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు జీతాలు పెంచడంతో మంగళవారం మండలంలోని కన్నెపల్లి గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్‌ల చిత్ర పటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. నాయకులు రాజేశ్, రవి, నారాయణ, జ్యోతిరావు, కళావతి, ఇంద్ర, దుర్గబాయి, మనీష తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బెజ్జూర్: బహుమతులు అందజేస్తున్న నాయకులు

బెజ్జూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని పరిగణలోకి తీసుకోకుండా క్రీడాకారులు క్రీడల్లో రాణించాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడెం గణపతి, జిల్లా అధ్యక్షుడు లేండుగురే శ్యామ్ రావు, ఆవుల రాజకుమార్‌లు అన్నారు. మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా స్వేరోల ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ అమరవీరుల స్మారక క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి మంగళవారం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి తుమ్మిడే అశోక్, ఆర్ఎస్పీ ఆర్మీ వ్యవస్థాపకులు కొండ రాంప్రసాద్, స్వేరో నాయకులు జావీద్ అలీఖాన్, బీఎస్పీ మండల అధ్యక్షుడు నీలయ్య, అధ్యక్షురాలు అమృత, నాయకులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

జైనూర్: క్రీడలతో శారీరక దృఢత్వం కలుగుతుందని హెచ్‌ఆర్‌సీసీ జిల్లా చైర్మన్ డోంగ్రే సమాధాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్‌లు అన్నారు. మంగళవారం జామిని యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు ముగియడంతో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి రూ. 10వేలు నగదును లటపటే మాధవ్ చేతుల మీదుగా అందించారు. జామ్ని మాజీ ఎంపీటీసీ డోంగ్రే దత్తాత్రి, మాజీ సర్పంచులు మడావి నాగోరావు, మెస్రం రాహుల్, యువజన సంఘం నాయకులు, తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ మండల దీక్షలు



భక్తులకు మాలధారణ చేస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్‌అర్బన్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో 40 మంది భక్తులు 41 రోజుల పాటు మండల దీక్షలు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు మాలధారణ చేశారు. అనంతరం దీక్షా సమయంలో పాటించాల్సిన నియమనిబంధనలు వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పిన్నా వివేక్, రూప్‌నార్ రమేశ్, వెంకన్న, శ్రీనివాస్, మధు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

‘మృతుడి కుటుంబానికి అండగా ఉంటాం’



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: ప్రమాదవశాత్తు పెద్దవాగులో మునిగి మృతి చెందిన విఘ్నేష్ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విఘ్నేష్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు.

పరామర్శించిన విశ్వ ప్రసాద్‌రావు..

మద్వాయిగూడ సమీపంలోని పెద్దవాగులో ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన విఘ్నేష్ కుటుంబ సభ్యులను మంగళవారం డీసీసీ అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ పరామర్శించారు. మృతుడి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చిన్నారులకు బాలామృతం పంపిణీ

మంచిర్యాలటౌన్: పోషణ పక్షంను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని 22వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు బాలామృతం, కోడిగుడ్లను ఆ వార్డు కౌన్సిలర్ మెరుగు మహేశ్వరి అందించారు. పోషణ పక్షం సందర్భంగా ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పౌష్టికాహారంపై పలు కార్యక్రమాల నిర్వహణలో భాగంగా చిన్నారులతో కలిసి పౌష్టికాహార భోజనం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సమ్మక్క పాల్గొన్నారు. పోషణ పక్షం సందర్భంగా అశోక్‌రోడ్డు సెక్టార్ పరిధిలోని కొత్తగుడిసెల 1వ అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి లబ్ధిదారులకు వివరించారు. అనంతరం పోషణ పక్షం ఆవశ్యకతలను వివరిస్తూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కె. తిరుమల, సహాయకురాలు కవిత పాల్గొన్నారు.

శనగ కొనుగోళ్లు ప్రారంభం

బోథ్: బోథ్ మార్కెట్ యార్డు పరిధిలో మంగళవారం శనగ కొనుగోళ్లను మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, డీఎం ప్రవీణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన శనగ పంటను మార్కెట్ యార్డుకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, జిల్లా కోఆప్షన్ సభ్యుడు తహెర్‌బిన్ సలాం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వసంతరావు, సహకార సంఘం చైర్మన్ ప్రశాంత్, సభ్యులు పాల్గొన్నారు.

పంటలపై అవగాహన



వీసీలో పాల్గొన్న అధికారులు

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని రైతువేదికలో మంగళవారం వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పంటలపై అవగాహన కల్పించారు. వేసవిలో మామిడి పంటలతో పాటు ఇతర పంటలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, ఏడీఏ మనోహర్, మండల వ్యవసాయ శాఖ అధికారిణి మధులత, హార్టికల్చర్ అధికారి శాంతిప్రియ, ఏఈవోలు శ్రీనివాస్, కవిత తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



ఏఈ శైలేందర్‌ను నిలదీస్తున్న ఎంపీటీసీ ప్రవీణ్

వాంకిడి: మండల కేంద్రంలో మంగళవారం జరిగిన మండలస్థాయి సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. మండలంలో అనేక సమస్యలు ఉన్నప్పటికీ కొన్ని సమస్యలపై మాత్రమే సమావేశంలో చర్చించారు. సమావేశానికి వ్యవసాయ శాఖ, విద్యా శాఖ, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, వైద్య ఆరోగ్య శాఖ, ఐటీడీఏ ఇంజనీరింగ్ విభాగం, పశు వైద్య శాఖ, ఐసీడీఎస్, ఆర్టీసీ, ఐకేపీ, ఈజీఎస్, నీటి పారుదల శాఖ, పౌర సరఫరాల శాఖల అధికారులతో పాటు ఎంపీపీ, వైస్‌ఎంపీపీలతో పాటు ఖమాన ఎంపీటీసీ మాత్రమే సమావేశానికి వచ్చారు.

మిషన్ భగీరథ ఏఈపై ఆగ్రహం..

ఖమాన గ్రామంలో మిషన్ భగీరథ నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని గతంలో జరిగిన సమావేశాల్లో సమస్యను లేవనెత్తిన అధికారులు పరిష్కరించడం లేదని ఖమాన ఎంపీటీసీ ప్రవీణ్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ఇంటింటికి ఇచ్చిన పైప్‌లైన్‌లకు ఇప్పటి వరకు ఎన్ని నల్లాలు బిగించారో చెప్పాలని నిలదీశారు. ప్రతీ ఇంటికి నల్లాలు పెట్టినట్లు ఏఈ శైలేందర్ తెలపడంతో ఖమానకు వెళ్లి నల్లాలు బిగించని పైప్‌లైన్లు ఎన్ని ఉన్నాయో చూడాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ ముండె విమలాబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ పెంటు, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, తహసీల్దార్ రోహిత్, ఎంపీడీవో వి.వి వరలక్ష్మి, ఎంపీవో ఖాజా అజీజుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్ కుమార్, వ్యవసాయ అధికారి మిలింద్ కుమార్, ఈజీఎస్ ఏపీవో శ్రావణ్ కుమార్, వైద్యాధికారి వినయ్ ఉప్రె, పీఆర్ ఏఈ స్టీవెన్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



కెరమెరి: కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో



చింతలమానెపల్లి: పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: ఉపాధిహామీ పథకంలో చేస్తున్న పనుల్లో కూలీలు రోజుకు రూ. 250 వచ్చేలా పనులు చేయాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని కరంజివాడ, బోరిలాల్‌గూడ గ్రామాల్లో కొనసాగిన ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎండలు మండుతున్న దృష్ట్యా తెల్లవారుజామునే పనులకు వెళ్లి ఉదయం 11గంటల లోపు తిరిగి రావాలన్నారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో మల్లయ్య ఉన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని జాజుల గూడెం, రణవెల్లి, రవీంద్రనగర్ 1, రవీంద్రనగర్ 2 గ్రామాల పరిధిలో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఉపాధి కూలీలకు, సిబ్బందికి సూచనలు చేశారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడవద్దన్నారు. వేసవి నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని, నిబంధనల మేరకు పనులు నిర్వహించాలన్నారు. ఆయనతో పాటు ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ వనజ అన్నారు. జిల్లాకేంద్రంలోని సుందరయ్యనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ డేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 23 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడంతో పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, ప్రొటీన్లు, విటమిన్లు, పప్పుదినుసులు తీసుకోవాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఆకుకూరలు, వివిధ పోషక విలువలకు సంబంధించిన ఆహార పదార్థాలు, ధాన్యాల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఫర్హా, అంగన్‌వాడీ కార్యకర్త రాధ తదితరులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: పిల్లలకు పోషకాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఈసీసీఈ కార్యక్రమాన్ని పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారంతో పాటు ఆటలను నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.